పచ్చిరొట్ట సాగుతో ప్రయోజనాలెన్నో

- డెల్టాలో చౌడు భూములకు జీలుగ రకంతో మేలు
- ఖరీఫ్‌లో అధికంగా ఎంటీయూ 1318 వంగడం సాగు


సిద్ధాపురం వరి చేలో జీలుగ సాగు

ఆకివీడు: వరి సాగులో పచ్చిరొట్ట పెంపకంతో భూమికి అధిక పోషకాలు అందుతాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అనేకరకాల ఎరువుల వాడకాన్ని తగ్గించడమే కాక భూసారాన్ని పెంచుతుంది. డెల్టా ప్రాంతంలో రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో పంట, మురుగు కాల్వల్లో సెలనిటీ నీరు అధికంగా ప్రవహిస్తుంది. దీంతో పంట భూముల్లో ఉప్పునీటి శాతం పెరిగి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్టలోని జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్టను పెంచి దీనిని భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెంపొందడానికి దోహదపడుతుంది. చౌడు భూములకు జీలుగ, పిల్లిపెసర రొట్ట సాగు అనేక ప్రయోజనాలు అందిస్తోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూసాంద్రతలో నత్రజని శాతం పెరుగుతుందని, దీనివల్ల నత్రజని ఎరువుల వాడకాన్ని ఆదా చేస్తుందని చెబుతున్నారు. డెల్టా ప్రాంతంలో ఈ ఏడాది పచ్చిరొట్ట సాగుపై ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు.

ముందస్తుకు ఎంటీయూ 1318 వంగడం మేలు

ముందస్తు ఖరీఫ్ సాగుకు ఎంటీయూ 1318 రకం వగడం మేలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 145 రోజులకు ఈ రకం వంగడం సాగు పూర్తవుతుంది. సాధారణ సాగుకు ఎంటీయూ 1064, 1061, స్వర్ణరకాలు మేలని సూచిస్తున్నారు. ఈ రకం వంగడం 130 నుంచి 135 రోజుల పంట కాల వ్యవధి ఉంది. ఖరీఫ్ సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు ఆర్బీకేలలో రైతులకు అందుబాటులో ఉన్నాయి. రైతులు తమ పేర్లు నమోదు చేయించుకుని విత్తనాలను పొందాలని అధికారులు సూచిస్తున్నారు. నాణ్యత, ప్రమాణాలతో కూడిన రైతు వారీ విత్తనాలపై కూడా మక్కువ చూపుతున్నారు.

పచ్చిరొట్టపై అవగాహన పెరుగుతోంది

డెల్టా ప్రాంతంలో పచ్చిరొట్ట సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ఉండి నియోజకవర్గంలోని ఆర్బీకేలలో పచ్చిరొట్ట విత్తనాల సాగు ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చిరొట్ట సాగుతో చౌడును తట్టుకుని, నత్రజని శాతం పెరిగే అవకాశం ఉంది. ఆర్బీకేల వద్ద రైతులకు అందుబాటులో అన్ని రకాల విత్తనాలు ఉన్నాయి.
– కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏడీఏ, ఆకివీడు

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం బీవీ రాజు మునిసిపల్ పార్క్ వీరమ్మ పాండ్ వద్ద గ్రీన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయని పలువురు వక్తలు అన్నారు. గ్రీన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.విజయ్ కుమార్, సభ్యులు కె.ఆనంద్, జూలూరి మూర్తి, రామాయణం చిన్నారి, కె.మోహన్, చరణ్, మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు కారుమూరి సత్యనారాయణ మూర్తి, బొండా రాంబాబు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు పలు అంతర్గత సీసీ రోడ్లు, ఎల్వీఎన్‌పురం గ్రామంలో సచివాలయ భవనాన్ని ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు ఆదివారం తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆదివారం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

వైభవంగా సూర్యహోమం


సూర్యహోమం నిర్వహిస్తున్న దంపతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం 160 సూర్యహోమం నిర్వహించారు. కోవిడ్ నుండి కోలుకుని ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలనే సంకల్పంతో మొదలు పెట్టిన సూర్యహోమం 160వ వారానికి చేరుకుంది. పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో పందిటి మోహన్ దంపతులు ఈ సూర్య హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మావుళ్లమ్మ జాతర


సిద్ధాంతంలో గ్రామ దేవత జాతర నిర్వహిస్తున్న భక్తులు

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము వరకూ గ్రామంలో మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ నిర్మాణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గరగల నృత్యాలు, సినీ వనకన్య ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి నృత్య రూపకం ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు తీర్థ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కేపీపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి


బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడిగాలులు వీస్తుండడంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి, వేళాంకణి మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేత 'సీతారాముడు'


క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీవీఎల్, శ్రీనివాసరాజు

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో నిర్వహించిన వన్డే ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో గ్రామ క్రిస్టియన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వన్డే ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గ్రామంలో 8 జట్లు పాల్గొనగా ఫైనల్‌కు సీతారాముడు లెవెన్స్, విక్టరీ లెవెన్స్ జట్లు చేరాయి. ఉత్కంఠంగా జరిగిన ఫైనల్ లో విక్టరీ లెవెన్స్ జట్టుపై నాలుగు పరుగుల తేడాతో సీతారాముడు లెవెన్స్ జట్టు విజయం సాధించింది. ఉత్కంఠంగా సాగిన ఆటను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస్‌రాజు ఆసక్తిగా తిలకించారు. ఫైనల్లో విజయం సాధించిన సీతారాముడు జట్టుకు రూ.15 వేలు, షీల్డ్, విక్టరీ జట్టుకు రూ.8వేలు, షీల్డ్‌లను పీవీఎల్, పాతపాటి శ్రీనివాసరాజు చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఫైనల్‌లో అద్భుతమైన ఆటను ప్రదర్శించిన రెండు జట్లకు పీవీఎల్ రూ.5 వేల చొప్పున ప్రత్యేక బహుమతిగా అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లను గ్రామానికి చెందిన గండి ప్రవీలిన్ లోవెల్ ఆర్థిక సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో కోపల్లె, కలవపూడి సొసైటీల అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెనుమత్స దుర్గా ప్రసాద్‌రాజు, మంతెన ఆంజనేయరాజు, సరాబు ముఖేష్ వైఎస్సార్ సీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష నిర్వహణ


జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్న నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్

ఆకివీడు: జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ సూచించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ఆదివారం వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులు పొందుతున్న పథకాలు తెలుసుకుని, ఇంకేమైనా పథకాలకు అర్హులైతే వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా జగనన్న సురక్ష పథకం అమలుజేస్తున్నారని చెప్పారు. అర్హులను గుర్తించి, వారి నుంచి దరఖాస్తు తీసుకుని అప్‌లోడ్ చేయడం ద్వారా సంబంధిత అర్హత పథకం వారికి వర్తింపజేసేందుకు వలంటీర్లు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం ప్రారంభిస్తారని కమిషనర్ చెప్పారు. 24వ తేదీ నుంచి వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలకు అర్హుల్ని గుర్తించాల్సి ఉంటుందన్నారు. అర్హులను విస్మరించకూడదనే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. జూలై 31వ తేదీ వరకూ అర్హులను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, వాటర్ వర్క్స్ ఏఈ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన వినయ్‌కి సత్కారం


కోలనపల్లిలో వినయ్‌ను సత్కరిస్తున్న పెద్దలు

కాళ్ల: ఇంటర్‌లో వెయ్యికి 957 మార్కులు సాధించి అందరి మన్ననలు పొందిన వినయ్ అభినందనీయులని పలువురు పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. కోలనపల్లి గ్రామానికి చెందిన సిరింగి వినయ్ ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు 957 సాధించిన సందర్భంగా ఆదివారం గ్రామంలోని చర్చిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం మండలం సీతారాంపురం గురుకుల కళాశాలలో చదివిన వినయ్ ఇంటర్‌లో ప్రతిభ చూపి జగనన్న ఆణిముత్యాలులో భాగంగా జిల్లా కలెక్టర్ నుంచి సన్మానం పొందడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంఘస్తులు, గ్రామ పెద్దలు వినయ్‌ని సత్కరించారు. ఎం.శ్రీనివాస్, అహరోను, యేసు రత్నం, ప్రభాకర్ రావు, జయరాజు, దానియేలు, రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు


ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: అంతర్జాతీయ ఫాదర్స్‌డే వేడుకలు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో పురుష సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్స్‌డేను పురస్కరించుకుని నిర్వహించిన మెన్స్ సండే కార్యక్రమాన్ని స్థానిక పేరిష్ పాస్టర్ వి.నెహ్రూ, సీఆర్ పి.కరుణాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులైన సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం రాజమంహేంద్రవరానికి చెందిన డాక్టర్ ఎస్.శేఖర్‌బాబు క్రీస్తు బోధించిన పురుషుడి విధులు, కుటుంబం, సమాజంలో అతని బాధ్యతలను వివరించారు. ఆయన మాట్లాడుతూ తండ్రి స్థానానికి సమాజంలోను, కుటుంబంలోను గొప్ప గౌరవం ఉందని, దానిని కాపాడుకుంటూ దేవునితో భయభక్తులు కలిగి బతకాలని సూచించారు. కుటుంబ పెద్దగా, భర్తగా నిర్వర్తించాల్సిన బాధ్యతను నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని, దీని ద్వారా ఓ మంచి కుటుంబాన్ని నిర్మాణం చేయగలమన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా జీవించాలన్నారు. తల్లిదండ్రులను గౌరవంగా చూసుకుంటారో దేవుడు వారిని దీవించి నిండునూరేళ్లు కాపాడతాడన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ లూథరన్ చర్చ్ సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, పురుష సమాజ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం


మేడపాడులో వాటర్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ప్రభుత్వంలో నవరత్నాల పేరిట పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అవినీతి, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదన్నారు. అదే సమయంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుకునేలా చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేసి వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రజలకు ఉత్తేజపరిచే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గంధం సత్యకీర్తి, దేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు, గాది వరదయ్య, బాలం అంజిబాబు, వర్ధనపు వెంకటేశ్వరరావు, కుక్కల సుబ్బారావు, కుక్కల ఆంజనేయులు, కుక్కల సూరయ్య, కుక్కల బాలచంద్రన్, ఉండ్రాజవరపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థి లంక రాకేష్ సాయిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణ తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తూర్పుకాపు కులానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న వారికి ప్రోత్సాహకాలుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆల్ ఇండియా ర్యాంకింగ్ జేఈఈ మెయిన్‌లో 286వ ర్యాంకు సాధించిన లంక రాకేష్ సాయిని సంఘం తరపున సత్కరించి, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మెరగాని ప్రసాద్, జిల్లా సంఘ అధ్యక్షుడు ఎస్.రామారావు, గౌరవ అధ్యక్షుడు మెరగాని అప్పారావు, డాక్టర్ నర్సింహమూర్తి, సందక ప్రకాష్, కన్నమ నాయుడు, తాళ్లపూడి పరమేశ్వరరావు, తాళ్లపూడి గాంధీ, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.

చేపల చెరువు తవ్వకం నిలిపివేయాలంటూ నోటీసు

ఆకివీడు: అనుమతి లేని చెరువు తవ్వవద్దని మత్స్య అభివృద్ధి అధికారి వివేక్ ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని అడ్డుకోడు పంట కాల్వకు చేర్చి వెలగన వెంకన్న అనే రైతు చేపల చెరువు తవ్వుతున్నారని, ఆ ప్రాంతానికి చెందిన రైతు వెలగన శ్రీనివాసరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల మత్స్య అభివృద్ధి అధికారి కె.వివేక్ ఆ ప్రాంతాన్ని ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి అనుమతి లేకుండా తవ్వుతున్న చెరువును తక్షణం నిలుపుదల చేయాలని నోటీసు జారీ చేశారు. తవ్వకం పనులు నిలుపుదల చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసు ద్వారా తెలియజేశారు.

కాలువలకు సమృద్ధిగా సాగు నీరు


వెలగలవారిపాలెం వద్ద భట్లమగుటూరు బ్రాంచ్ కాలువకు సాగునీరు విడుదల చేసిన దృశ్యం

పెనుమంట్ర: మండల పరిధిలోని ప్రధాన కాలువలకు సమృద్ధిగా సాగునీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సమాయత్తమవుతున్నారు. గోస్తనీ పంటకాలువలో నీరు పుష్కలంగా విడుదల కావడంతో బ్రాంచ్ కాలువలకు కూడా శనివారం నుంచి నీరు విడుదల చేయడంతో రైతులు నారుమడులకు సిద్ధమవుతున్నారు. పెనుమంట్ర పరిధిలో భట్లమగుటూరు, నేలపోగుల బ్రాంచ్ కాలువలకు సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం

నరసాపురం: పట్టణంలోని 11వవార్డులో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో విద్యుత్ హై ఓల్టేజ్ కారణంగా పలు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు బూడిదయ్యాయి. 10 ఇళ్లలో ఏసీలు, 25 ఇళ్లలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, 10 ఇళ్లలో ఫ్రిజ్‌లు కాలిపోయాయి. కొన్ని ఇళ్లలో మంటలు కూడా రావడంతో జనం భయభ్రాంతులకు లోనయ్యారు. వార్డులోని వెలంపేట, ద్వారావారి వీధి రెండు ప్రాంతాల్లోని ఇళ్లు ప్రమాదానికి లోనయ్యాయి. వార్డులో తరచూ ఇలానే జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

క్రికెట్ కిట్ అందజేత


క్రికెట్ కిట్ అందజేస్తున్న గుణ్ణం నాగబాబు


పాలకొల్లు సెంట్రల్: యువకులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ఆటలతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు అన్నారు. ఆదివారం పెదపేటకు చెందిన అంబేద్కర్ యువజన క్రికెట్ టీం సభ్యులకు నాగబాబు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాయంత్రం సమయంలో వాతావరణం చల్లబడిన తరువాతనే ఆటలకు సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుణ్ణం సురేష్, సబ్బితి డింబు, వసంతబాబు, బాలాజీ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మానాన్న సేవా సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఫాదర్స్ డే నిర్వహించారు. యాగర్లపల్లిలో నివసిస్తున్న రోగులకు, పేదలకు ఫాదర్స్ డే సందర్భంగా బిర్యానీ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ నిరుపేదలను, రోగులను గుర్తించాలని, వారికి వీలైనంత సహాయం చేయాలని వివిధ స్వచ్ఛంద సంస్థలకు విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు వర్రే కోటేశ్వరరావు, కార్యదర్శి మహమ్మద్ కపర్ది, కిరణ్ పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు


కాలువలు వదలక ముందు లోసరి చానల్‌లో పేరుకున్న చెత్త


గొల్లవానితిప్పలో పంటకాలువలోకి చేపల చెరువుల మురుగు నీటిని తోడుతున్న దృశ్యం (ఫైల్)

- ఇష్టానుసారంగా కోళ్ల కళేబరాలు, చెత్త డంపింగ్
- యథేచ్ఛగా చేపల చెరువుల వ్యర్థ జలాలు వదిలివేత
- ఈ నీరే దిగువ గ్రామాలకు తాగునీటిగా సరఫరా

భీమవరం అర్బన్: కాలుష్య కోరల్లో పంటకాలువలు కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో శివారు ప్రాంత గ్రామస్తులు ఆ నీటిని తాగి అనారోగ్యానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తోకతిప్ప, దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప, అనాకోడేరు, కొమరాడ, తుమ్మగొప్పి, తాడేరు, బేతపూడి, రాయలం, వెంప, తుందుర్రు తదితర 25 గ్రామాలకు రక్షిత మంచి నీటి చెరువులకు తాగునీరు, సుమారు 59 వేల 490 ఎకరాల వరి, చేపలు చెరువులకు సాగునీరు అందుతుంది. మండలంలో ప్రదానంగా వెంప, లోసరి గూట్లపాడు, కాళీపట్నం, అనాకోడేరు ఛానల్స్ ద్వారా తాగు, సాగు నీరందుతుంది. భీమవరం పట్టణాన్ని ఆనుకుని ఈ పంటకాలువలు ప్రవహించడంతో కొంతమంది పట్టణవాసులు చెత్తను పంటకాలువల్లోనే డంపింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఎగువన ఉన్న గ్రామస్తులు పంట కాలువల్లోకి మురుగును వదిలివేయడంతో పంటకాలువలు కాలుష్యంబారిన పడుతున్నాయి. ఈ నీరు దిగువ గ్రామాలకు తాగునీటిగా సరఫరా చేస్తుండటంతో ఆ నీటిని తాగి తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లోనే చెత్త డంపింగ్

పంటకాలువల్లో భీమవరం పట్టణ వాసులు క్యారీ బ్యాగులు, బొంతలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్ల కళేబరాలు ఇతర వ్యర్థాలు పడేయడంతో నీరు కలుషితమవడంతో పాటు రెగ్యులేటర్ల వద్ద ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దిగువకు నీరు సజావుగా ప్రవహించడం లేదని దిగువున ఉన్న గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో రక్షిత మంచినీటిని నింపుతున్న తరుణమిది

వర్షాకాలం సమీపించడంతో ఇటీవల పంటకాలువలు ద్వారా నీటిని విడుదల చేశారు. రక్షిత మంచినీటి చెరువులకు చెరువులలో తాగునీటిని నింపుతున్నారు. ఈ నేపథ్యంలో పంట కాలువల్లోని కలుషిత నీటితోనే చెరువులను నింపాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

పంటకాలువల్లోకి మురుగునీటి తోడకం

గూట్లపాడు, గొల్లవానితిప్ప, కొత్తపూసలమర్రు తదితర గ్రామాలలో వరి పొలాలు, రొయ్యలు, చేపలు చెరువులకు మురుగు బోదెలు లేకపోవడంతో వాటి వ్యర్థ జలాలను పంటకాలువల్లోకి నీటిని తోడుతున్నారు. దీంతో పంటకాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి.

కాలువల పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలి

ఎగువున ఉన్న పట్టణవాసులు పంటకాలువల్లో వ్యర్థాలు వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి. దిగువన గ్రామాలు ఈ నీరే తాగుతారని గమనించాలి. ఎవరైనా చెత్త పంటకాలువల్లో డంప్ చేస్తే అట్టివారికి జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటాం.
– భూపతిరాజు వెంకట ప్రసాదరాజు, ఏఈ, ఇరిగేషన్, భీమవరం